ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.6, కనిష్ఠం 26.8



ఎంపీగా అర్వింద్ ప్రమాణ స్వీకారం



పెద్దబజార్, జూన్ 25: నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ధర్మపురి అర్వింద్ మంగళవారం లోక్‌సభలో ప్రమాణస్వీకారం చేశారు. నిజామాబాద్ ఎంపీగా రెండోసారి గెలిచిన అర్వింద్‌తో లోక్‌సభ స్పీకర్ రాధామోహన్ సింగ్ ప్రమాణస్వీకారం చేయించారు.


'గ్రూప్-2'కు గ్రాండ్ టెస్టుల నిర్వహణ

నిజామాబాద్ అర్బన్, జూన్ 25: టీజీపీఎస్సీ గ్రూప్-2 రిక్రూట్‌మెంట్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 8వ తేదీ నుంచి ప్రతి పేపర్‌కు నాలుగు గ్రాండ్ టెస్టులు ఆఫ్‌లైన్‌లో బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రాండ్ టెస్టులకు హాజరుకావాలనుకునే ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను టీజీబీసీస్టడీసర్కిల్.సిజిజి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో జూలై 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు 08462-241055 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యూపీఎస్సీ సివిల్స్‌కు ఉచిత శిక్షణ

సివిల్స్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష 2025కు బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు జూలై 3వ తేదీ వరకు టీజీబీసీస్టడీసర్కిల్.సిజిజి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్ జూలై 7న ఉంటుందని ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి, రవాణా ప్రయోజనం కింద నెలకు 5వేల రూపాయలు, 5వేల రూపాయల బుక్‌ఫండ్ ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.





జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి!

- ఫోన్ కొట్టు.. గంజాయి పట్టు!
- పంథా మార్చిన గంజాయి స్మగ్లర్లు
- చిన్న చిన్న ప్యాకెట్లతో డోర్ డెలివరీ
- కిలోల చొప్పున జిల్లాకు సరఫరా
- గ్రామగ్రామాన గంజాయి విక్రయాలు
- మత్తుకు బానిసవుతున్న జిల్లాలోని యువత
- గంజాయి మత్తులో జిల్లాలో పెరుగుతున్న దారుణాలు

సుభాష్‌నగర్, జూన్ 25: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. విచ్చల విడిగా గంజాయి లభిస్తోంది. చిన్న చిన్న ప్యాకెట్లు మొదలు కిలో వరకు తూగే గంజాయిని డోర్ డెలివరీ చేసే విధానం కొనసాగుతోంది. సంచుల్లో, ప్యాకెట్లలో పెద్ద మొత్తంలో తరలిస్తే సులువుగా పట్టుపడుతున్నామన్న భయంతో రవాణా చేసే విధానంలో కొత్త మార్గాలు ఎంచుకున్నారు. ఇందులోకూడా ఫోన్ చేసిన వెంటనే గంజాయిని అందించే ముఠా ఒకటి జిల్లాలో చెలరేగిపోతోంది. గంజాయి కొనుగోలుదారులు, మత్తుకు బానిసైన వారు అతిసులువుగా ఈ సరుకును పొందేందుకు ఫోన్ కాల్ విధానం కొనసాగిస్తున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. గంజాయి రవాణా చేసే స్మగ్లర్లు వారికి సంబంధించిన వ్యక్తులు ఇచ్చే ఫోన్ నెంబర్లకు కాల్ చేసిన వెంటనే వ్యక్తుల వద్దకు వెళ్లి గంజాయిని అందిస్తున్నారు. ఇది తక్కువ మొత్తంలో ఉండడం అందులో రవాణా సులువుగా ఉండడంతో ఈ గంజాయి అక్రమ అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

ప్యాకెట్ల రూపంలో సరఫరా

జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి గ్రామ గ్రామానికి గంజాయిని సరఫరా చేస్తున్నారు. పెద్దమొత్తంలో గంజాయి నిల్వ ఉంచితే ఎక్సైజ్, పోలీసు అధికారులు పసిగడుతుండడంతో కొద్దిమొత్తంలో గంజాయిని తెచ్చుకుని చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ విలువ సుమారు 400 నుంచి 600 రూపాయలకు అమ్ముతున్నారు. నిత్యం గంజాయి తాగేవారు వారి కోడ్‌ద్వారా గంజాయి సరఫరా దారులతో చెబుతూ గంజాయిని తమవద్దకు చేర్చుకుంటున్నారు. ఎండు గంజాయిని చీటా అనే పేరుతో పచ్చి గంజాయిని గ్రీన్ పేరుతో సరఫరా చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో తమ అడ్డాను వేసుకుని గంజాయి తాగున్నారు. జిల్లాలోని నందిపేట్, డొంకేశ్వర్, ఆర్మూర్, బాల్కొండ, నగరంలోని శివారు కాలనీల్లో గంజాయిని సరఫరా చేస్తున్నారు. ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన గంజాయిని జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లకే గతంలో పరిమితమవగా ప్రస్తుతం మండలాల, గ్రామాల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఇదివరకు పట్టణాలకే పరిమితమైన గంజాయి ప్రస్తుతం గ్రామగ్రామాన వ్యాపించి యువతను పెడమార్గంలో పయనించేలా చేస్తోంది.

మత్తుకు బానిసవుతున్న యువత

జిల్లాలో యథేచ్ఛగా గంజాయి దొరకడంతో యువత మత్తుకు బానిసవుతోంది. నగరంతో పాటు పలు మండల కేంద్రాలే కాకుండా గ్రామాల్లో సైతం చాక్లెట్లు కొనుక్కున్నంత తేలిగ్గా గంజాయి దొరకడంతో యువత గంజాయి వైపు మొగ్గుచూపుతున్నారు. మొదటగా సరదాకోసం గంజాయి తాగిన యువకులు అనంతరం మత్తుకు బానిసవుతున్నారు. పల్లెపల్లెల్లో గంజాయి అందుబాటులోకి రావడంతో యువత గంజాయివైపు మొగ్గుచూపుతున్నారు. ఒకరినుంచి ఒకరు పెద్ద మొత్తంలో గంజాయికి బానిసలవుతున్నారు. ఇది వరకు గంజాయి తాగేవారు గంజాయి ఆకును బీడీ చుట్టలచుట్టి తాగేవారు. ప్రస్తుతం కొత్త పద్ధతులను అవలంబిస్తున్నారు. సిగరేట్‌లోని పొగాకును తీసివేసి ఎండు గంజాయి నింపి తాగుతున్నారు. గంజాయి మత్తులో యువత ఏంచేస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాతోపాటు నగరంలో గంజాయి మత్తులో కత్తులతో దాడులు చేసుకున్న ఘటనలు చాలా ఉన్నాయి. చిన్నపాటి గొడవకూడా గంజాయి మత్తులో చివరకు ఒకరినొకరు చంపుకునే వరకు వెళ్తున్నాయి.



పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

మహారాష్ట్ర నుంచి జిల్లాకు సరఫరా

మహారాష్ట్ర ప్రాంతం నుంచి జిల్లాకు గంజాయి చేరుతోంది. జిల్లాకు ఆనుకొని మహారాష్ట్ర శివారు ఉండడంతో అక్కడి నుంచి జిల్లాలోకి గంజాయి చేరుతోంది. ముఖ్యంగా నాందేడ్, ధర్మాబాద్, తదితర ప్రాంతాల నుంచి జిల్లాలోకి గంజాయి చేరవేస్తున్నారు. పెద్దమొత్తంలో కాకుండా కిలోల చొప్పున గంజాయిని జిల్లాకు చేరుస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా రైళ్లలో చిన్న మొత్తంలో జిల్లాలోకి తీసుకువస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలోని శివారు ప్రాంతాల నుంచి రోడ్డు మార్గంలో సైతం గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆబ్కారీ, పోలీస్‌శాఖ తూతూ మంత్రంగానే చర్యలు చేపడుతోంది. పెద్దమొత్తంలో డంపులు లేకపోవడంతో చిన్నవాటిపై దృష్టిసారించడం లేదు. గత కొన్నిరోజులుగా గంజాయి పట్టుకున్న దాఖలాలు లేవు. పెద్దమొత్తంలో గంజాయి రవాణా జరిగితే పట్టుకుంటున్న ఆబ్కారీ, పోలీస్‌శాఖలకు చిన్న మొత్తంలో సరఫరా చేస్తూ రెండు శాఖలకు గంజాయి అక్రమ రవాణాదారులు సవాలు విసురుతున్నారు.

జిల్లాలోకి గంజాయి చేరకుండా చర్యలు తీసుకుంటున్నాం..

:మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నిజామాబాద్



జిల్లాలోకి మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతోంది. నాందేడ్ నుంచి గంజాయిని తీసుకురాకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా మూడు టీమ్‌లను ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు రైళ్లలో ఆర్‌పీఎఫ్ పోలీసుల సహాయంతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. రోడ్డు మార్గం ద్వారా రాకుండా చెక్‌పోస్టులలో గట్టినిఘా పెంచాం.



అద్దె భవనాలు.. అరకొర వసతులు

- జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లు
- ఇబ్బందులు పడుతున్న వసతి గృహాల విద్యార్థులు
- సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు కరువు
- వసతులు లేక విద్యార్థులకు తప్పని అవస్థలు
- 14 నెలలుగా అందని అద్దె బకాయిలు

నిజామాబాద్ అర్బన్, జూన్ 25: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో అందులో వసతి పొందుతున్న పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సొంత భవనాలు లేని ప్రాంతాలలో అద్దె భవనాలలో వసతి గృహాలను నిర్వహిస్తున్నప్పటికీ అద్దె భవనాలకు 14 నెలలుగా అద్దె రాకపోగా కొన్ని భవనాలకు ఆరు నెలలుగా అద్దె రాకపోవడంతో భవనాల యజమానులు మరమ్మతులు చేయించేందుకు వెనకాడుతున్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో పేద విద్యార్థులు ఎక్కువగా చదువుకునే అవకాశం ఉండగా సుదూర ప్రాంతాల నుంచి వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అన్ని రకాల వసతులను కల్పించాల్సి ఉండగా అద్దె భవనాలు సమస్యల నిలయంగా ఉంటున్నాయి. చాలీచాలని అద్దె ఇస్తుండటంతో భవన యజమానులు సైతం వసతులు కల్పించడంలో వెనకడుగు వేస్తున్నారు. చేసిన రిపేర్లకు సైతం బిల్లులు మంజూరు చేయడం లేదు. కానీ ఇచ్చే అద్దెలో మాత్రం మరమ్మతుల పేరుతో 5శాతం కోత విధిస్తూ భవన యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో భవన యజమానులు విసిగి వేసారి మరమ్మతులు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. వర్షాకాలం కావడంతో భవనాల్లో లీకేజీలు, కిటికీలకు జాలీలు లేకపోవడంతో విషపూరిత కీటకాలు వచ్చే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు మాత్రం భవనాలకు రిపేర్లు చేయించడంలో వెనకడుగు వేస్తున్నారు. మండల కేంద్రాల్లో సరైన భవనాలు లేక కొన్ని వసతిగృహాలు జిల్లా కేంద్రంలో కొనసాగుతున్నాయి. వాటిలో కూడా అరకొర వసతులే ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కిటికీలకు జాలీలు లేక దోమల బెడదతో విద్యార్థులు జ్వరాల బారినపడే అవకాశం ఉంది. వసతి గృహాలను నిరంతరం తనిఖీ చేయాల్సిన అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ సంక్షేమ అధికారులు ఒక్క వసతి గృహాన్ని తనిఖీ చేసిన పాపాన పోలేదు.

వసతి గృహాలలో 10వేల మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా వివిధ వసతి గృహాలలో 10వేల మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 34 బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉండగా అందులో సుమారుగా 4 వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. 42 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉండగా వాటిలోను 4వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. 10 గిరిజన వసతి గృహాలలో 1500 మంది విద్యార్థులు ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 10వేలకు పైగా పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులు వసతిగృహాల్లో వసతి పొందుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి, మండల కేంద్రాలకు చదువుకునేందుకు వచ్చి అక్కడే వసతిగృహాల్లో వసతి పొందుతూ విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా వసతి గృహాల్లో మాత్రం అరకొర వసతులు ఉంటున్నాయి. వసతి గృహాల్లో సరైన వసతులు లేక చాలా మంది విద్యార్థులు వాటిలో ఉండేందుకు భయపడుతున్నారు. సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు అరకొర నిధులే విడుదల అవుతుండటంతో ఏళ్ల తరబడి పాత భవనాల్లోనే వసతి గృహాలను కొనసాగిస్తున్నారు. అద్దె భవనాలకు అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో వాటిలోనే సమస్యలు అధికంగా ఉంటున్నాయి. చిన్న చిన్న రిపేర్లు సైతం అద్దె భవనాల యజమానులే చేయాల్సి ఉండటంతో వారు కూడా అద్దె రాకపోవడంతో పనులను చేయడం లేదు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఇదివరకు నారాయణ జూనియర్ కళాశాల ఉన్న భవనంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నవీపేట బాలికల వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. కానీ అందులో సమస్యలు అధికంగా ఉన్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లను తనిఖీ చేయాల్సిన ఆర్‌సీవో నాలుగు జిల్లాల బాధ్యతలు నిర్వహించాల్సి ఉండటంతో ఆమె కూడా వసతి గృహాలపై సరైన పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



కిటికీలకు ఊడిపోయిన జాలీలు

23 వసతిగృహాలు అద్దె భవనాల్లోనే..

జిల్లా వ్యాప్తంగా 86 వివిధ సంక్షేమ వసతిగృహాలు ఉండగా 63 వసతి గృహాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా 23 వసతి గృహాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 42 ఎస్సీ వసతిగృహాలు ఉండగా అందులో 9 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 34 బీసీ వసతిగృహాలు ఉండగా 12 అద్దె భవనాల్లో, గిరిజన సంక్షేమ వసతిగృహాలు జిల్లా వ్యాప్తంగా 10 ఉండగా 2 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దెభవనాలకు సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో వసతి గృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె రాక, చేసిన రిపేర్లకు బిల్లులు రాక అద్దె భవనాల యజమానులు వసతి గృహాలను ఖాళీ చేయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని దుబ్బలో ఇదివరకు ఉన్న బీసీ బాలికల వసతిగృహాన్నికి అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో దానిని ఓ ప్రైవేటు పాఠశాలలోని భవనంలోకి మార్చారు. కింది అంతస్తు ప్రైవేటు పాఠశాల ఉండగా, పై రెండు అంతస్తుల్లో వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. ఇలా జిల్లాలో అనేక చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహాలు సక్రమంగా లేవు. బాత్‌రూమ్‌లు, డైనింగ్ హాల్ సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో దోమల బెడద అధికంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ కిటికీలకు దోమతెరలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించాం..

రమేష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి

వసతి గృహాల్లో ఉన్న సమస్యలపై అధికారులకు నివేదిక పంపించాం. మరమ్మతులపై ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. విద్యాసంవత్సరం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.



రేకుల షెడ్డులో కొనసాగుతున్న డైనింగ్ హాల్



వసతిగృహం పక్కన ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు

నీటి కుంటగా మారిన నందిపేట-నిజామాబాద్ మెయిన్ రోడ్డు



రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

- చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్న మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు
- చిత్తడి రోడ్డుతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- సర్కస్ ఫీట్లు చేస్తున్న పాదచారులు

నందిపేట, జూన్ 25: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు చిత్తడిగా మారింది. ఇటీవల కురసిన మోస్తరు వర్షాలకు నందిపేటలోని ప్రధాన రోడ్డు చిన్న చిన్న కుంటలను తలపిస్తోంది. వాటి నుంచే పెద్ద వాహనాలు అధిక లోడుతో వెళ్లడంతో ప్రమాదకరంగా గుంతలు ఏర్పడుతున్నాయి. నంది విగ్రహం చౌరస్తా నుంచి మసీద్ వరకు ఉన్న బీటీ రోడ్డుపై అన్ని గుంతలే ఏర్పడ్డాయి. ఆ గుంతలలో వర్షం నీరే కాకుండా మురికి నీరు చేరుతోంది. మరికొన్ని చోట్ల ఇళ్ల నుంచి మురికి నీరు రాగా, హోటల్ యజమానులు అదే గుంతలలో మురికి నీటిని తీసుకొచ్చి పోస్తున్నారు. అలాగే నంది విగ్రహం చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా, ఐలమ్మ చౌరస్తా మీదుగా వివేకానంద చౌరస్తా వరకు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించి, బీటీ చేసి వదిలేశారు. మిగిలిన రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. ఆ రోడ్డుపై నుంచి పోవాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. ద్విచక్ర వాహన దారులు, పాదచారులు సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



• ఎన్‌మార్ట్ ఎదుట ప్రమాదకరంగా గుంతలు ఇలా..

నిలిచిన పనులను త్వరగా పూర్తి చేయాలి..

: ఎస్‌కే జావెద్, నందిపేట



మండల కేంద్రంలో నిర్మిస్తున్న నాలుగు లైన్ల రోడ్డు(డబుల్ రోడ్డు) పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం రాజకీయ నాయకులు ఆగమేఘాల మీద రోడ్డు పనులు చేపట్టారు. ఎన్నికలు పూర్తయినా రోడ్డు పనులు మాత్రం అలాగే మిగిలి పోయాయి. మధ్య, మధ్యలో విడిచి పెట్టిన పనులు వెంటనే పూర్తి చేయాలి.

ప్రధాన చౌరస్తాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి..

: గజ్‌బీంకర్ నారాయణ, నందిపేట



మెయిన్ రోడ్డుపై నంది విగ్రహం చౌరస్తాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి. మట్టిని పూర్తిగా తొలగించి సిమెంట్‌తో ఏపుగా రోడ్డును నిర్మించాలి. అప్పుడే నీరు నిలువకుండా ఉంటుంది. అలాగే పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా మసీద్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాలి.

'రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం'

బోధన్‌రూరల్,జూన్25: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో సీఎం రేవంత్ రెడ్డి చేయడం అభినందనీయమన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర, బోధన్ మండలాల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నా రవి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ వచ్చిందని, రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ అల్లె జనార్ధన్, మాజీ జడ్పీటీసీ అల్లె రమేష్, కేజీ గంగారాం, చీల శంకర్, బీహారి, హన్మంత్‌రావు,బుయ్యన్ సురేష్, సొక్కంరవి, శ్రీనివాస్ రెడ్డి, రైతులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎడపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఒకేసారి రైతులు తీసుకున్న రెండు లక్షల రుణమాఫీకి కేబినెట్ ఆమోదం తెలపడంతో మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు తీసుకున్న రెండు లక్షల వరకు రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పాటు పడే ప్రభుత్వం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌రావు, నాయకులు బంజ కామప్ప, మల్కారెడ్డి, శంకర్ నాయుడు, మోహన్ రెడ్డి, ఎల్లయ్య యాదవ్, నారాయణ, మచ్కూరి గంగాధర్, కంచరి శ్రీనివాస్, బొబ్బిలి శ్రీనివాస్, నవీన్, రత్నాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


సాలూరలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండులక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో మంగళవారం కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీరాముల మురళి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామంటూ నాన్చుడుధోరణి అవలంబించడంతో రైతులకు అధిక వడ్డీభారం పడిందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నాట్లు ప్రకటించడం హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెన్నెల దేవేందర్, శ్రీరాముల సుమన్ పాల్గొన్నారు.

'డైట్ కళాశాల ప్రిన్సిపల్‌ను బదిలీ చేసి విచారణ జరిపించాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 25: డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌పై అనేక ఆరోపణలు ఉండగా ఆయనపై విచారణకు ప్రభుత్వం ఆదేశించిన దృష్ట్యా వెంటనే ఆయన్ను బదిలీ చేసి విచారణ పారదర్శకంగా జరిగేలా చూడాలని పీడీఎస్‌యూ డైట్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తరుణ్, అర్విందలు అన్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో డైట్ కళాశాలలో జరిగిన విచారణలో కళాశాల ప్రిన్సిపల్ సమక్షంలోనే జరిగాయని విచారణ అధికారులను మేనేజ్ చేసి శ్రీనివాస్ తప్పించుకున్నారన్నారు. ఇప్పుడు విచారణ కూడా ప్రిన్సిపల్ లేకుండానే నిర్వహించాలన్నారు. రూ.30లక్షల నిధుల గోల్‌మాల్‌తో పాటు ట్రైనీ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం, ఇతరత్రా వేధింపుల వల్ల అనేక మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. వెంటనే ఆయన్ను బదిలీ చేసి విచారణ జరిపించాలన్నారు.

బడాపహాడ్ హుండీ ఆదాయం రూ.21లక్షలు

వర్ని,జూన్25: వర్ని మండలం బడాపహాడ్(పెద్దగుట్ట)హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ మంగళవారం పూర్తయింది. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు స్థానిక వక్ఫ్‌బోర్డు ఇన్‌చార్జి సద్దాం, సూపరిండెంట్ జమాల్, పోలీసు బందోబస్తు, వీడియో చిత్రీకరణ మధ్య నాలుగు హుండీలలో భక్తులు సమర్పించిన కానులను వేర్వేరుగా లెక్కించారు. రెండు నెలల ఆరు రోజుల హుండీ ఆదాయం రూ.21లక్షలు వచ్చినట్లు సూపరిండెంట్ జమాల్ తెలిపారు. టెండర్ విధానం కంటే ఈ ఆదాయం వక్ఫ్‌బోర్డుకు లాభదాయకంగా పేర్కొన్నారు. లెక్కించిన మొత్తం నగదు, కానుకలను బందోబస్తు మధ్య రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయానికి తరలించి వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజ్మాతుల్లా హుస్సేనికి సమాచారం అందజేసినట్లు జమాల్ వెల్లడించారు. కాంట్రాక్ట్ విధానంలో దోపిడిని నియంత్రించడానికి ప్రస్తుత ఆదాయం ఉదాహరణగా స్పష్టం చేశారు. వక్ఫ్‌బోర్డు సిబ్బంది పారదర్శకంగా తమ విధులను నిర్వర్తించినట్లు పేర్కొన్నారు. కొత్త టెండర్ ప్రక్రియ ప్రారంభం వరకు నిర్వహణ బాధ్యతలు వక్ఫ్‌బోర్డు అధీనంలో ఉంటుందని తెలిపారు. భక్తులు స్వచ్ఛందంగా దోపిడీకి దూరంగా ఉంటూ తమకు తోచిన కానుకలు హుండీలో వేయాలని జమాల్ కోరారు.

కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నిజామాబాద్ అర్బన్, జూన్ 25: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అదే విధంగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల ఫీజు దోపిడిని అరికట్టాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది లేక విద్యార్థుల సంఖ్య పెరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, నిఖిల్, రవీందర్, హన్మాండ్లు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రాముఖ్యతపై అవగాహన

ఆర్మూర్‌టౌన్ జూన్25: మున్సిపల్ పరిధిలోని ఎంజే ఆసుపత్రిలో మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ లింగ నిర్ధారణ, లింగ వివక్ష బేటీ బచావో బేటీ పడావో, పోక్సో చట్టం మిషన్ వత్సల్య, మిషన్ శక్తిస్కీమ్‌లపై ఎఎన్ఎంలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిత మధుశేఖర్, డాక్టర్ జైదీప్, జెండర్ స్పెషలిస్టు సౌమ్య, కవిత, టి.పుష్ప, జమ్రు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ముప్కాల్, జూన్25: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీంకు సమాచారం అందించాలని ముప్కాల్ ఎస్సై భాస్కరచారి సూచించారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. విద్యార్థినుల రక్షణ కోసం షీటీం ఏర్పాటు చేశామన్నారు. ఏ విధమైన ఆపదలో ఉన్నా.. వంద నెంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలకు, మోసాలకు గురైతే 1930నెంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ కానిస్టేబుల్ గంగామణి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట పెట్టుబడి సాయంపై వీడియో కాన్ఫరెన్స్

ముప్కాల్, జూన్25: ముప్కాల్ రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పంటల పెట్టుబడి సాయంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. రైతుల నుంచి రైతు భరోసా గురించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. బాల్కొండ నియోజకవర్గం నుంచి ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ రైతు గడ్డం చిన్నారెడ్డి మాటాడుతూ.. రైతు భరోసా పది ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు అమలు చేయాలని కోరారు. బీడు భూములకు ఇవ్వకుండాసాగు చేసి రైతులకే పెట్టుబడి సాయం అందించాలన్నారు. ఇన్‌కంటాక్స్ కట్టే రైతులకు రైతు భరోసా ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ డివిజన్ ఏడీఏ మల్లయ్య, మండలాల అగ్రికల్చర్ ఆఫీసర్‌లు మహేందర్, సాయికృష్ణ, లావణ్య, ఏఈవోలు నిషజకాంత్, అరుణ, అలేఖ్య, సాయికృష్ణ, రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ఎడపల్లి: పది ఎకరాల లోపు రైతులకే రైతు భరోసా ఇవ్వాలని నియోజకవర్గ రైతులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు భరోసాపై నియోజకవర్గ స్థాయి రైతులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిద్ధి రామేశ్వర్, నియోజకవర్గ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బట్టాపూర్‌లో 50 ట్రిప్పుల ఇసుక సీజ్

ఏర్గట్ల, జూన్ 25: మండలంలోని బట్టాపూర్ గ్రామంలో మంగళవారం 50 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ తెలిపారు. బట్టాపూర్ గ్రామ శివారులోని ఊరగుట్ట వద్ద అక్రమంగా ఇసుక నిల్వలు ఉన్నట్లు సమాచారం మేరకు ఆర్ఐ సదానంద్ అక్కడికి వెళ్లారని చెప్పారు. అక్కడ ఉన్న ఇసుకను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇసుకను వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే సభ్యులు ఉదయం 10.30 గంటలకు వచ్చి పాల్గొనాలని తహసీల్దార్ సూచించారు.

బడిబాట ప్రవేశాలు అంతంతే !

● కోటగిరి బడిబాట కార్యక్రమంలో ప్రవేశాలు అంతంత మాత్రంగానే జరిగాయి ● గురుకుల పాఠశాలలపైనే తల్లిదండ్రుల ఆసక్తి



కోటగిరి మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలు స్వీకరిస్తున్న దృశ్యం



కారేగాంలో ఒకే విద్యార్థినికి పాఠాలు బోధిస్తున్న విద్యావలంటీర్



కారేగాంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల

కోటగిరి,జూన్25:బడీడు, చదువు మధ్యలో ఆపేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్న ప్రధాన లక్ష్యంతో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలో బడిబాట వల్ల విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో జరగలేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నూతననమోదు అంతంత మాత్రంగానే ఉంది.ఈనెల 6నుంచి 19వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొనప్పటికీ సంతృప్తికరమైన రీతిలో ప్రవేశాలను పెంచలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి తోడు బడిబాట జరుగుతుండగానే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించడంతో 9ఏళ్లుగా పదోన్నతులు, బదిలీల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు ఆ ప్రయత్నాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టాల్సి వచ్చింది. జిల్లాలో సుమారు 5వేల మందికి పైగా బడిబాటలో విద్యార్థులు చేరినట్లు అధికారులు చెప్తున్నారు.

● గురుకులాల పాఠశాలలపైనే ఆసక్తి

సాధారణంగా ప్రైవేటు పాఠశాలలపై ఆసక్తి ఉండడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య ప్రతియేటా తగ్గుతూ వస్తుంది. ఈ విద్యా సంవత్సరంలోనూ అదే పరిస్థితి ఉండగా దీనికి తోడు వసతి గృహం సౌకర్యం, ఇంగ్లీష్ మీడియం బోధన ఇంకా అన్ని ఉచిత సదుపాయాలతో ఉండే గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకే ఆయా తరగతుల్లో చేరాలకునే విద్యార్థులు, వారి తల్లిండ్రులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే 4,5,6వ తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించే వివిధ సంక్షేమ గురుకులాల పాఠశాలల ప్రవేశ పరీక్షలు విద్యార్థులు రాస్తున్నారు. అక్కడ సీటు రాగానే గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. పొతంగల్ మండలంలోని కారేగాం ప్రాథమిక పాఠశాలల్లో ఈ విచిత్ర పరిస్థితి నెలకొంది. ఇక్కడ పని చేసే ఉపాధ్యాయుడు గత యేడాది మృతి చెందాడు. ఆయన స్థానంలో గత యేడాది డిప్యూటేషన్‌పై ఒక ఉపాధ్యాయుడిని కొనసాగించారు. ఈ యేడాది పాఠశాల ప్రారంభంలో 8మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఒకే ఒక విద్యార్థిని మిగలడం విశేషం. మిగిలిన విద్యార్థులను తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు, గురుకుల పాఠశాలలకు తరలించారు. పాఠశాల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాల కింద 5లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇక్కడ నిధులు ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఇక్కడ ఒకే ఒక విద్యార్థిని ఉండడంతో వీవీని ఏర్పాటు చేసి పాఠశాల నిర్వహిస్తుండడం కొసమెరుపు. పదోన్నతులతో పాటు బదిలీల్లో భాగంగా ఇక్కడికి ఉపాధ్యాయులు వచ్చే అవకాశం లేకుండా పోయే అవకాశం ఉంది. బోధన్ డివిజన్‌లోనూ ఏకోపాధ్యాయ పాఠశాలలు పదుల సంఖ్యలో ఉండడంతో తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన చదువులు అందే అవకాశం లేదని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది గురుకుల పాఠశాలలకు ప్రాధాన్యత ఇస్తుండగా ఆర్థికంగా ఉన్న వారు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు మేల్కొని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

నేడు ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్

లింగంపేట, జూన్ 25: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చల విడిగా ఫీజులువసూలును నిరసిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికవసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు లింగంపేట మండల ప్రధాన కార్యదర్శి నవీన్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ అనుమతులులేని ప్రైవేటు పాఠశాలలను అధికారులు సీజ్ చేయాలని కోరారు.

డిచ్‌పల్లి: ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల ఫీజుల దోపిడిని అరికట్టడంలో ప్రభుత్వ సంస్థలో మౌళిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ కారణంగా ఈనెల 26 రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో బందును పిలుపునిచ్చిందని ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు శివా తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనపై ప్రభుత్వంపై దృష్టి సారించాలని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాహనదారులకు ఆవుల మందతో ప్రమాదాలు



లింగంపేటలో ప్రమాదానికి గురైన మనోహర్

లింగంపేట్, జూన్ 25:లింగంపేట మండల కేంద్రంలో ఎల్లారెడ్డి- కామారెడ్డి రహదారిపై రాత్రి పగలు రోడ్డుపై ఆవులు, లేగదూడలు, ఎద్దులు సంచరించడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సోమ వారం రాత్రి రోడ్డుపై అవుల మంద ఉండడంతో వాటిని చూసి ద్విచక్ర వాహనంపై తక్కు వేగంతో వెళ్లుతున్న మనోహర్ ద్విచక్రవాహనానికి ఆవు లు ఎదురుగా వచ్చి గుద్దడంతో మనోహర్ కిందపడి తీవ్రంగా గాయప డ్డాడు. వెంటనే అతనిని స్థానికి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథ మిక చికిత్సలు నిర్వహించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కామా రెడ్డికి తరలించారు. మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై పోలీస్ స్టేషన్ నుంచి సబ్‌స్టేషన్ మధ్యలో 50వరకు ఆవులు, లేగలు, ఎద్దులు రోడ్డుపై రాత్రి పగలు తిరుగుతున్నాయని వాటి ద్వారా ప్రతీ రోజు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశువుల యజమానులు రోడ్డుపైన వదలకుండా వాటిని ఇంటి వద్ద ఉంచుకోవాలని కోరుతున్నారు. ఆర్‌అండ్ బీ అధికారులు, పోలీసులు రోడ్డుపై నివసిస్తున్న ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చి వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పశువైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం

● ఏడీ శ్రీనివాస్

దోమకొండ, జూన్ 25:మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని ఏడీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక రైతులు జడ్పీటీసితో కలసి పశువైద్యశాలను పరిశీలించారు. వైద్యశాలలో సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో రైతులు తమ మేకలు, పశువులకు చికిత్సలు అందించాలంటే ఇబ్బందులు పడవలసి వస్తుందని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా గతంలో ముత్యంపేటకు చెందిన సిబ్బంది దోమకొండలో అందుబాటులో ఉండేవారిని కానీ అతను గత నెలలో పదవీ విరమణ పొందినట్లు ఏడీ తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండేలా జేడీ దృష్టికి తీసుకెళ్తానని ఏడీ శ్రీనివాస్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

డిచ్‌పల్లి,జూన్ 25: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన మారుపక దత్తాద్రి (61) అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం 11గంటలకు చేపలు పట్టేందుకు ఇంట్లోనుంచి వెళ్లిన దత్తాద్రి ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించిందని మృతదేహంపై గాయాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మారుపక లింబాద్రి మృతిపై ఎస్సై మహేశ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

కల్తీ విత్తనాలను అరికట్టాలి

మాక్లూర్,జూన్ 25:రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కల్తీ విత్తనాలు అరికట్టాలని, అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. మంగళవారం మండలంలోని మానిక్‌బండార్ ఏఐకెఎంఎస్ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన ఎన్నికల హామీతో రైతు బంధు, రూ.2లక్షల రుణమాఫీ వెంటనే అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఘన స్వాగతం

కమ్మర్‌పల్లి, జూన్ 25: గత నెల అమెరిక పర్యటనకు వెళ్లి మంగళవారం తిరుగుపయనమైన బీఆర్ఎస్ మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి శంశాబాద్ ఏర్‌పోర్టులో కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, జిల్లానాయకుడు బద్దం చిన్నారెడ్డి, మండల వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్,రాజాగౌడ్, ఎంపీటీసీలు మైలారం సుధాకర్, గంగాధర్, మాజీ సర్పంచ్ ప్రభాకర్,లస్కర్‌నాయక్,ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రకాశ్ నాయక్, రేంజర్ల మహేందర్, కోనాపూర్ నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

విద్యాసంస్థలకు అంతరాయం కలిగించకూడదు

ఆర్మూర్‌టౌన్, జూన్25: బంద్, నిరసన పేరుతో విద్యాసంస్థలకు ఏలాంటి అంతరాయం కలిగించకూడదని ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల వద్ద విద్యార్థి సంఘాలు, నాయకులు వెళ్ళి సహజ సిద్దమైన కార్యక్రమాలు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగిస్తే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

లింగంపేటలో 13 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు

● నంబర్ ప్లేట్ లేని 25 వాహనాల సీజ్



లింగంపేటలో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

లింగంపేట,జూన్ 25: లింగంపేట మండల కేంద్రంలో మంగళవారం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీ నిర్వహించి 13డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ లింగంపేటలో 25నంబర్ ప్లేట్‌లు లేని వాహనాలను సీజ్ చేశామని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఆయన తెలిపారు. వాహనదారులు హెల్మెట్ ధరించి, పరిమిత వేగంతో వాహనాలను నడపాలని ఆయన సూచించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో సీఐ రవీందర్ నాయక్, లింగంపేట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, గాంధారి, తాడ్వాయి, ఎల్లారెడ్డి, సదాశివనగర్, నాగిరెడ్డిపేట, ఎస్సైలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేసిన ఎస్సై

ధర్పల్లి, జూన్ 25: మండల కేంద్రానికి చెందిన కాసుల సాయిలు అనే వ్యక్తికి మంగళవారం ఎస్సై విక్రమ్ తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి ఎస్సై అందజేశారు. 15రోజుల క్రితం తన సాయిలు ఫోన్ చోరీకి గురైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి బాధితునికి ఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు సాయిలు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న వస్తువులను అప్పగించిన కండక్టర్



ప్రయాణికుడి సామాగ్రిని అప్పజెపుతున్న కండక్టర్

వర్ని,జూన్25: చందూర్ మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ తన ఉదారతను చాటుకున్నాడు. బోధన్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంజీవ్ రెడ్డి అనే కండక్టర్ మంగళవారం టీఎస్ 676369 బస్సులో జేబీఎస్ వరకు విధుల్లో చేరాడు. బాన్సువాడలో ఓ ప్రయాణికుడు కవర్‌లో ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు, అకౌంట్ బుక్కులు, పొలం పట్టా బుక్కులు, కొంత నగదును మరిచి బస్సు దిగి వెళ్లిపోయాడు. దీంతో వాటిని గమనించిన సంజీవ్ రెడ్డి కవర్‌ను తన వద్ద భద్రంగా దాచి పెట్టాడు. తిరుగు ప్రయాణంలో ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఆధారంగా ప్రయాణికుడికి సమాచారం ఇచ్చి కంట్రోలర్ శరణప్ప సమక్షంలో పోగొట్టుకున్న కవర్‌ను ప్రయాణికుడి చేతికి అప్పజెప్పారు. దీంతో సంతోషించిన ప్రయాణికుడు కండక్టర్ సంజీవ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పదిఎకరాల లోపు వారికే రైతు భరోసా ఇవ్వాలి

డిచ్‌పల్లి,జూన్ 25: రైతు భరోసా ను పది ఎకరాల లోపు రైతులకు మాత్రమే ఇవ్వాలని వ్యవసాయ సాగు భూమి కి మాత్రమే రైతు భరోసా అందించాలని డీడీఏ తిర్మలప్రసాద్ రైతు నేస్తం కార్యక్రమాన్ని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పంట పండని బీడు భూములకు, వెంచర్‌లకు,శిఖం భూములకు సర్వే చేయించి దరణి నుంచి తొలగించి వ్యవసాయ శాఖ కు వాస్తవ నివేదిక అందించినప్పుడే అర్హులకు అందుతుందన్నారు. ఏడీఏ ప్రదీప్ కుమార్, ఏవో లు రాంబాబు, రవీందర్, ఈరా, దేవిక, ఏఈవోలు, విండో చైర్మన్‌లు పాల్గొన్నారు.

టీయూ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షల తేది ప్రకటన

డిచ్‌పల్లి,జూన్ 25: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ 1,3 వ ఇంటిగ్రేటెడ్ కోర్సుల 7,9 సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షల ఫీజు జూలై 1 లోపు చెల్లించాలని 100రూ.అపరాధ రుసుముతో జూలై 4 వరకు చెల్లించవచ్చునని పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంద్రించలన్నారు.

● ఎంఎడ్ పరీక్షల టైంటేబుల్ విడుదల

తెలంగాణవిశ్వవిద్యాలయ పరిధిలోని ఎంఎడ్ పరీక్షలు జూలై 5నుంచి ప్రారంభమైవుతు న్నట్లు ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతాయని సీవోఈ అరుణ తెలిపారు.

● పీజీ సెమిస్టర్ రీవాల్యూయేషన్ షెడ్యూల్ విడుదల

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ 1,3,5సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలకు హాజరైన విద్యార్థిని, విద్యార్థులు పరీక్షల విభాగం రీవాల్యూయేషన్ తేదిని ప్రకటించింది. జూలై 1 లోపు రివాల్యూయేషన్ కోరిన విద్యార్థిని విద్యార్థులు ఒక్కో పేపరు రూ.500 చెల్లించాలని సీవోఈ తెలిపారు.

హిందు మనోభావాలను దెబ్బతిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్ , జూన్25: హిందు సమాజ మనోభావాలను దెబ్బతిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హిందు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొద్దిరోజులుగా నిర్మించిన పిరమిడ్ అక్రమకట్టడంలో వారు వ్యవహారిస్తున్న వైఖరిపై తహసీల్దార్ దర్యాప్తు చేపట్టాలని, హిందు వ్యతిరేక కార్యకలాపాలు పిరమిడ్ వారు నిర్వహించడం సమాజంసం కాదని, పిరమిడ్ కట్టడం లోపల విగ్రహాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని లేని యేడల ఎండోమెంట్ వారు ఆదీనం తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, జిల్లా ప్రధానకార్యదర్శి మందుల బాలు, కార్యదర్శి ఉదయ్‌గౌడ్, బోచ్‌కర్ నిఖిల్, పెద్దోళ్ళ గోపి, తదిత రులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చలో హైదరాబాద్

రుద్రూరు,జూన్25: దివ్యాంగుల డిమాండ్ల సాధనకై వికలాంగుల హక్కుల పోరాట సమితి ఇచ్చిన పిలుపు మేరకు రుద్రూరు మండలం నుంచి మంగళవారం దివ్యాంగులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు సాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం లేదన్నారు.

కమ్మర్‌పల్లిలో బీమా చెక్కు పంపిణీ

కమ్మర్‌పల్లి, జూన్ 25: మండల కేంద్రంలోని గాంధీనగర్ వడ్డర కాలనికి చెం దిన జరుపుల గంగు ఇటీవల మరణించడంతో ఆమె చేసిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్ భీమాక్లేమ్ 4లక్షల 37 వేల చెక్కును మంగళవారం నామిని (మృతురాలి కూతురు) మాలోత్‌సుజాతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎం నగేష్, ఆర్మూర్ బ్రాంచ్ మేనేజర్ సందీప్, ఆనంద్, స్థానికులు పూట్నూర్ రాజశేఖర్, మలావత్ సంతోష్‌పూట్నూర్ (ధోని) రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వ్యక్తి హత్య

● దర్గా డబ్బుల విషయంలో గొడవ

ఖిల్లా, జూన్ 25 : దర్గా డబ్బుల విషయంలో జరిగిన గొడవలో వ్యక్తి దారుణంగా హత్యకు గురైన ఘటన ఆరో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ధర్మపురిహిల్స్ ప్రాంతంలో మంగళవారం వెలుగుచూసింది. 12వ డివిజన్ పరిధిలోని రంజానీబాబా దర్గాలో ఉండే హసన్(50)అనే వ్యక్తివద్ద ఉన్న డబ్బుల విషయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో గొంతువద్ద, మొఖంపై భాగాన(నుదిటిపైన)తీవ్రంగా గాయపడి ఆయన వద్ద ఉన్న సుమారు రూ.15వేలను ఎత్తుకెళ్లినట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దక్షణ మండల రూరల్ ఇన్స్‌పెక్టర్ సురేష్ నేతృత్వంలో ఆరవటౌన్ ఎస్ మొగలయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు ఉన్న ఆయన దర్గాలోనే ఉండేవాడని, తరుచు మనవరాలి వద్దకు వెళ్లి స్నానం చేసే వాడని పోలీసులు తెలిపారు. దుండగుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఆయన కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

● రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడంతోనే పెరుగుతున్న నేరాలు

నగరంలోని ఆరో టౌన్ పోలీసు స్టేషన్‌లో రెగ్యులర్ పోస్ట్ ఎస్ఐ లేకపోవడంతో ఈ ప్రాంతంలో నేరాలు పెరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. గత కొంత కాలంగా సద్దుమణిగిన గొడవలు, కత్తుల దాడు లు ఇటీవల అదే పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో తిన్న బిల్లు విషయంలో జరిగిన గొడవలో సైతం కొందరు కత్తులతో, కర్రలతో దాడులు చేసుకున్నారు. వారిని అడ్డుకోవడానికి వెళ్లిన పోలీసులపైన దాడిచేయడానికి యత్నించిన ఘటన సైతం జరిగింది. దీంతో పోలీసులు వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ పోలీసు స్టేషన్ నగరశివారులో ఉండడంతో పాటు ఇక్కడ నేరప్రవృత్తి కార్యకలాపాలు అనేకంగా జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంలో స్థానికులు జీవనం సాగిస్తున్నారు. గతంలో రేషన్ బియ్యం అక్రమ రవాణ విషయంలో రౌడీషీటర్లు కత్తులతో పరస్పర దాడులు చేసుకుని హత్యలకు పాల్పడ్డారు. దీంతో అప్పటి పోలీసు అధికారులు ఆ ప్రాంతంపై సీరియస్‌గా ఉండి దాడులకు పాల్పడే వారిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఇటీవల ఆ పోలీసు స్టేషన్‌కు రెగ్యులర్‌గా విధులు నిర్వహించే ఎస్ఐతో పాటు మరికొంత మంది సిబ్బందిని నియమించకపోవడం, పరిధి పెద్దదిగా ఉండడం నేరాలు చేయడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు బాస్ ఈ ప్రాంతంపై దృష్టిపెట్టి రెగ్యులర్ ఎస్ఐతో పాటు మరికొంత మంది సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

పొదుపు సంఘాలకు అందని వడ్డీ డబ్బులు

● ఐదేళ్ల నుంచి చెల్లించని ప్రభుత్వాలు ● మూడు మున్సిపాలిటీలలో సుమారు రూ. 6.20 కోట్ల బకాయిలు

ఎల్లారెడ్డి, జూన్ 25: జిల్లాలోని మున్సిపాలిటీలలో స్వయం సహాయక పొదుపు సంఘాలకు కొన్నేళ్ల నుంచి ప్రభుత్వాలు వడ్డీ డబ్బులు చెల్లించడం లేదు. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో పొదుపు సంఘాలకు 2019-20 సంవత్సరం నుంచి వడ్డీ రావాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కలుపుకుంటే ఐదు సంవత్సరాల వడ్డీ రూ.6.20 కోట్ల బకాయి పేరుకుపోయింది. వడ్డీ డబ్బులు ఎప్పుడు ఇస్తారు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఆర్థిక సంవత్సరం ఇటీవలే ముగిసిన కనీసం వడ్డీల డబ్బులను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయడం లేదు. వడ్డీ లేని రుణం ఇస్తున్నామని చెబుతున్నారే తప్పా బ్యాంకులు వసూలు చేస్తున్న వడ్డీని తిరిగి ఇవ్వడంలో ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయి. దీంతో జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో సుమారు 2370 పొదుపు సంఘాల మహిళలకు ఎదురు చూపులు తప్పడం లేదు.

● కొత్త సంఘాల ఏర్పాటుపై వడ్డీ ఎఫెక్ట్

ప్రతి సంవత్సరం మెప్మా ఆధ్వర్యంలోని సిబ్బంది కొత్తగా మహిళా సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కో సంఘం ఏర్పాటు చేయాలంటే 10 మంది మహిళలు తప్పనిసరిగా ఉండాల్సిందే. ఒక్కో మహిళా రూపాయలు చొప్పున ఏర్పాటు బ్యాంకులో పొదుపు చేసిన తరువాత ఆరు నెలలకు రుణమిస్తారు. కాని గత నాలుగేళ్లుగా పొదుపు సంఘాలకు ప్రభుత్వాలు వడ్డీ విడుదల చేయకపోవడంతో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసుకునే వాళ్ల ప్రతినెల 10వ తేదిలోగా చెల్లించకుంటే అధిక వడ్డీ పడుతుందని భయంతో ముందుకు రావటే్లదని సమాచారం.

● అధికారుల వద్ద లేని సమాచారం..

జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో పొదుపు సంఘాలకు రావాల్సిన వడ్డీ బకాయిల డబ్బులు ఎప్పుడు విడుదల చేస్తారని మహిళలు ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. మున్సిపల్ కార్యాలయాల్లో మెప్మా సిబ్బందిని వడ్డీ గురించి అడుగుతున్న సిబ్బంది వద్ద కూడా ఇలాంటి సమాచారం ఉండటం లేదని కనీసం మెప్మా జిల్లా అధికారుల వద్ద కూడా సమాచారం లేదని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వాలు స్పందించి మహిళా సంఘాలకు వడ్డీ డబ్బులు విడుదల చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

శెట్పల్లిసంగారెడ్డి పాఠశాల ఆవరణలో వంటా వార్పుతో నిరసన

లింగంపేట, జూన్ 25 : లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి పాఠశాల ఆవరణలో పాఠశాలకు స్థలాన్ని ఇచ్చిన బాధితులు స్థలం కోసం పాఠశాల ముందు వంటా వార్పుతో నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులోని సర్వేనంబర్ 1248లోని 34గుంటల భూమిని అప్పట్లో గ్రామపంచాయితీ తీర్మాణంతో పాఠశాల నిర్మాణం కోసం అందించారు. గ్రామానికి చెందిన ఉప్పెరి మనెమ్మ, బర్ల భరత మ్మ, ఉప్పరి గంగమణి, కళావతి, అనుసమ్మ, దుర్గయ్యలకు చెందిన భూమని పాఠశాల నిర్మాణానికి ఇవ్వగా పాఠశాలకు ఇచ్చిన స్థలానికి బదులుగా మరోచోట ప్రభుత్వ భూమిని ఇస్తామని అప్పటి పంచాయితీ పాలకవర్గం, రెవెన్యూ అధికారులు మాట ఇచ్చారు. దీంతో వారు స్థలాన్ని పాఠశాలకు ఇవ్వగా సంవత్సరాలు గడిచినా స్థలానికి బదులు స్థలం ఇవ్వకపోవడంతో వారు రెవెన్యూ అధికారుల చుట్టు, ప్రజాప్రతి నిధుల చుట్టు తిరుగుతున్నా వారికి భూమికి బదులు భూమి చూపక పోవడంతో వారు పాఠశాల ఆవరణలోనే వంట చేసుకుని అక్కడే భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇట్టి భూమికి ఇప్పటికి రైతు బందు డబ్బులు వీరి ఖాతాలోనే పడుతున్నాయని వారు తెలిపారు. ఈ విషయమై ఎంఈవో రామస్వామిని వివరణ కోరగా పాఠశాలకు ఇచ్చిన స్థలానికి బదులు వారికి మరోచోట వ్యవసాయ భూమికి చూపకపో వడంతో సమస్య నెలకొందని ఆయన తెలిపారు. సమస్యను తహసీల్దార్ నరెందర్ దృష్టికి తీసువెళ్లగా బుధవారం ఆర్ఐను పంపి విచారించ నున్నట్లు తెలిపారని ఆయన తెలిపారు.

ఈటెల ప్రమాణ స్వీకారానికి ఢిల్లీకి వెళ్లిన బీజేపీ నేతలు

ఎడపల్లి, జూన్ 25: మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికై ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ వెళ్లిన ఈటెల రాజేందర్‌ను ఢిల్లీలో మంగళవారం ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన బీజేపీ ఓబీసీ జిల్లా నేత, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు యాసాడ నర్సింగ్ ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు బోధన్ ముదిరాజ్ సంఘం నాయకులు గంగాధర్, అదిలాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శివన్న తదితరులు ఉన్నారు.



ఈటెలను కలిసిని బిజేపి నేతలు

పోలీసుల స్పెషల్ డ్రైవ్



మామిడిపల్లిచౌరస్తాలో వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్, జూన్25: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో మంగళవారం పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు, ట్రిబుల్ డ్రైవింగ్‌లో దొరికిన వాహనాలను సీజ్ చేయడం జరిగిందని, అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టార్ వివేకానందరెడ్డి, ట్రాఫిక్ సీఐ ఓ.డి.రమేష్, స్థానిక ఎస్సై అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలకు పరిష్కారం ఎప్పుడో



అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

- కనీస అవసరాలకు అందనంత దూరంలో అంగన్‌వాడీ కేంద్రాలు
- సొంత భవనం లేని అంగన్‌వాడీ కేంద్రాలు ఎన్నో?

మోస్రా,జూన్25: మండలంలో మొత్తం 11అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈకేంద్రాల్లో గ్రామాల్లోని 6సంవత్సరాల లోపు పిల్లలకు విద్య బుద్దులు నేర్పుతూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ ఎదుగుదలకు అవసరం అగు భోజనం ఏర్పాటు చేస్తుంటారు.

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక శ్రద్ధ

పోషన్ అభియాన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పకడ్బంది ప్రణాళిక ప్రకారం గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు నాణ్యమైన భోజనం, ఉడికించిన గుడ్డు, ఆకు కూరలతో భోజనం పెడుతూ వారి ఆరోగ్యం కాపాడుతూ పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం పట్ల శ్రద్ద చూపే ప్రణాళికలను ఏర్పాటు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో అందట్లేదని సమాచారం. అదే విధంగా ప్రభుత్వాలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల్లోకి తీసుకుపోవడానికి ఈ కేంద్రాలు సమృద్ధిగా పని చేస్తాయి.

● ముఖ్య వసతులు లేక ఇబ్బందులు ఎన్నో

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పసి పిల్లలు వస్తూ ఉటారు. కాని ఇక్కడ విద్యుత్ సదుపాయం లేదు.కొన్ని చోట్ల ఉన్న పిల్లలు ఉండే గదుల్లోకి విద్యుత్ సదుపాయం లేదు. మరుగుదొడ్లు లేక మరింత ఇబ్బంది కొన్ని చోట్ల మరుగుదొడ్లు ఉన్న ఎవరో గుర్తు తెలియని వ్యక్తుల వల్ల కొన్ని తలుపులు పగులగొట్టడం, లోపల కూడా అన్ని పగలగొట్టి ఉన్నవి చూడవచ్చు. మరికొన్ని కేంద్రాల్లో మంచి నీటి సమస్యలు ఉన్నాయి. అవి కొందరి అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సొంత భవనం లేని అంగన్‌వాడీ కేంద్రాలు

మోస్రా మండల కేంద్రంలో మొత్తం ఐదు కేంద్రాలు ఉండగా ఇక్కడ ఒక అద్దె భవనంలో కొనసాగుతున్న ఇక్కడ వసతులు కరువు మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న ఒక్క అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతున్న ఇప్పటి వరకు ఈ భవనం నిర్మాణం ఏర్పాటుకు స్థలాలు పరిశీలనకు నోచుకోలేదు.

● అంగన్‌వాడీలో ఆయలు కరువు

మండలంలో మొత్తం 11కేంద్రాలు ఉండగా మండల కేంద్రంలో ఒక కేంద్రంలో ఏడబ్ల్యూ టీచర్ లేరు. ఇక్కడ ఉన్న ఆటీచర్ రామాలయం వద్ద గల కేంద్రంకు బదిలీ రూపంలో వెళ్లి ఇక్కడ ఖాళీ చూపిస్తున్నారు. రామాలయం వద్దఉండే అంగన్‌వాడీటీచర్ పదోన్నతి పొంది సూపర్‌వైజర్‌గా వెళ్లారు.అదేవిధంగా కొన్ని కేంద్రాల్లో ఆయాలు లేని కేంద్రాలు నాలుగుఉన్నాయి.

అంగన్‌వాడీ సమస్యలపై అధికారుల దృష్టి పెట్టాను

మోస్రా మండలంలో ఏర్పడిన సమస్యలను ప్రతి సంవత్సరంపై అధికారుల దృష్టిలో రాత పూర్వక పత్రం ద్వారా పెడుతూ ఉన్నాను. నేను మస్రా మండల సూపర్‌వైజర్‌గా వచ్చి ఐదేళ్లు అవుతుంది. అప్పటి నుండి ఇప్పటి వరకు కొన్ని కేంద్రాల్లో సమస్య పరిష్కారం చేశాను.

- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత

'రైతుల సొమ్ము దుర్వినియోగం చేస్తే క్షమించరాని నేరం'



మాక్లూర్ మండల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్

మాక్లూర్, జూన్ 25: ప్రజాప్రతినిధిగా ఎన్నికైన ప్రతీఒక్కరు ప్రజలతో పాటు రైతులకు సేవ చేయాలని అలాంటి వారి సొమ్మును దుర్వినియోగం చేస్తే క్షమించరాని నేరమని జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మాక్లూర్ మండల సర్వసభ్య వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాక్లూర్ విండోలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని, రైతులను కాపాడాల్సిన నాయకులే రైతుల సొమ్మును మింగేశారని అట్టి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం మండల చివరి సమావేశం కావడంతో ఎంపీపీ మాస్త ప్రభాకర్, వైస్‌ఎంపీపీ సుక్కి సుజాతలతో పాటు ఎంపీటీసీసభ్యులను జడ్పీచైర్మన్ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, తహసీల్దార్ మహ్మద్ షకీర్, ఎంఈవో, ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారిపై ఏర్పడ్డ గుంత పూడ్చివేత



నవీపేట రోడ్డుపై ఏర్పడ్డ గుంతను మొరంతో పూడ్చివేసిన దృశ్యం

నవీపేట,జూన్25: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతను మంగళవారం అధికారులు పూడ్చివేయించారు. నవీపేట నుండి రాంపూర్ వెళ్లే రహదారిపై పెద్ద సైజులో గుంత ఏర్పడడంతో రోడ్డుపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.దీంతో ఈనెల 24న ఆంధ్రజ్యోతి దినపత్రికలో"రహదారిపై ఏర్పడ్డ గుంతను పూడ్చి వేయాలి" అనే వార్తకు ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు.మంగళవారం రోడ్డుపై ఉన్న మురికి నీరు, వర్షపు నీటిని తొలగించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను మొరంతో పూడ్చివేయించి చదును చేశారు.రహదారిపై ఏర్పడ్డగుంతను పూడ్చివేయడానికి కృషిచేసిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన జూడాల నిరసన



ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జూడాలు

పెద్దబజార్, జూన్ 25: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్ల సమ్మె మంగళవారం రెండవ రోజు కొనసాగింది.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 10వ తేదీలోగా స్టైఫండ్ ఇచ్చేలా గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేయాలన్నారు. సూపర్ స్పెషాలిటీ, సీనియర్ రెసిడెంట్లకు ఒకలక్షా 25వేలు గౌరవవేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు సురేష్, తేజస్విని,రిషబ్ అగర్వాల్, అర్విందస్, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన డీఎల్‌పీవో

మోపాల్, జూన్ 25:గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనుల రికార్డులను డీఎల్‌పీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని సింగంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. గ్రామ పంచాయతీలో ఉన్న రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేనిది రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

నవీపేట,జూన్25: మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం నుండి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించాలని ఎంపీడీవో నాగనాథ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో మరుగుదొడ్డి ఉందా, లేదా అనే విషయాలను నమోదు చేయాలని కోరారు.వారం రోజులలో ఈ సర్వేను పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధుల మంజూరు

సిరికొండ, జూన్ 25: మండలంలోని గడ్కోల్, సర్పంచ్ తాండా, గోప్యా తాండా పరిధిలో 6 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి 24లక్షలు మంజూరు అయ్యాయి. వాటర్ షెడ్డు పథకంలో ఈ నిధులు మంజూరు అయ్యాయి. వాటర్ షెడ్డు పథకంలో ఒక్కో చెక్‌డ్యామ్ నిర్మాణానికి 4లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటి పనులు సంబంధిత అధికారులు ప్రారంభించారు.

వైద్యాధికారికి ఘన సన్మానం



ఇందల్వాయిలో వైద్యాధికారికి సన్మానిస్తున్న సిబ్బంది

ఇందల్వాయి, జూన్ 25:మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రతి సోమ, మంగళవారం గర్భిణీ స్త్రీలకు ఉచిత రక్త పరీక్ష నిర్వహిస్తూ వైద్య నిపుణులచే పరీక్షలు చేయాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాలలో హైపర్ టెన్షన్, డయాబెటిస్ రోగులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టాలని వారికి నెలసరిపడా మందులను సరఫరా చేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తూ నీటి తొట్టెలలో, పాత టైర్లలో నిలువ ఉన్న నీటిని దోమలు వ్యాప్తి చెందకుండా తొలగించాలన్నారు. క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తూ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని తెలిపారు. దోమల వల్ల కలిగే ఎటువంటి వ్యాధులైనా వాటి నిర్మూలన కోసం దోమల లార్వాలను నిర్మూలించడానికి నీటిలో గంబుష చేపలను వదలాలని ఆదేశించారు. డెంగ్యూ వ్యాధి సోకే దోమలు మంచినీటిలోనే పెరుగుతాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కుక్కకాటు, పాముకాటు నివారణ ఇంజెక్షన్‌లను నిలువ ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సందీప్, జిల్లా అసంక్రమిత వ్యాధుల కోఆర్డినేటర్ వెంకటేశ్, జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు వెంకటేశ్వర్లు, ఫార్మసిస్టు విజయలక్ష్మి, స్వామి, సులోచన, నాగరాజు, శంకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దేవాలయాలే హిందూ ధర్మ పరిరక్షణ కేంద్రాలు



మాట్లాడుతున్న స్వామి కమలానంద భారతి

పెద్దబజార్, జూన్ 25: దేవాలయాలే హిందూ ధర్మ పరిరక్షణ కేంద్రాలు అని భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతి స్వామి అన్నారు. మంగళవారం నగరంలోని హైమద్‌బజార్‌లోగల శంభునిగుడి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి హిందువు బాధ్యతగా హిందువుల దేవాలయాలు, దేవుడి ఆస్తులు ఆక్రమణకు గురవుతే ప్రతీ హిందువు తన ఇళ్లు ఆక్రమణకు గురయ్యే విధంగా భావించి రోడ్డుపైకి రావాలని అప్పుడే మన హిందువు జాతి అస్తిత్వం బలంగా ఉంటుందన్నారు. దేవాలయాల పరిరక్షణ కోసమే రెండు తెలుగు రాష్ట్రాల్లో సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన యాత్ర పేరుతో తాను నిర్వహించిన పాదయాత్ర, రథయాత్రలో తెలుసుకున్న విషయాలు ఎంతో ఆవేదన కలిగించాయని అన్నారు. ఈ సమావేశంలో పరిరక్షణ సమితి కన్వీనర్ ప్రసాద్‌పటేల్, జైపాల్,ప్రవీణ్, యెండల సుధాకర్, స్వామియాదవ్,శ్రీనివాస్ శర్మ, వివిధ హిందూ సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు డీవీకే స్మారక స్తూపం ఆవిష్కరణ

పెద్దబజార్, జూన్ 25:నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల రేడియోస్టేషన్ ఎదుట విప్లవ ఉద్యమనాయకుడు ఆదర్శ కమ్యునిస్టు ప్రజాపంథ కార్యదర్శి అమరుడు డివికృష్ణ స్మారక స్తూపం ఆవిష్కరణ బుధవారం నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథ నాయకుడు వి.ప్రభాకర్ తెలిపారు.ఉదయం 11గంటలకు ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆల్ ఇండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ఠాకూర్, ముఖ్యవక్తలు హాజరవుతున్నట్లు తెలిపారు.

స్కూటీ నుంచి రూ.2 లక్షల దొంగతనం



సీసీ కెమెరాలో దొంగతనం చేసిన వ్యక్తి ఫొటోలను పరిశీలిస్తున్న పోలీసులు

భీమ్‌గల్ రూరల్, జూన్25: భీమ్‌గల్ పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకు నుంచి కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామానికి చెందిన కొప్పెర సాంబయ్య అనే వ్యక్తి రూ.2 లక్షలను డ్రా చేసుకొని బయటకు వచ్చాడు. బ్యాంకు బయట వున్న తన స్కూటీ డిక్కీలో నగదును పెట్టుకున్నాడు. కొద్ది సేపు వేరే దగ్గర ఆగి మళ్లీ వచ్చేసరికి స్కూటీ డిక్కీ నుంచి రెండు లక్షలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గమనించాడు. వెంటనే బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై హరిబాబు, సీఐ శ్రీనివాస్ బ్యాంకు వద్దకు వచ్చి బ్యాంకులోని సీసీ కెమెరాలను పరిశీలించారు. బ్యాంకులో గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి ముసుగు తొడుగుకొని సాంబయ్య కూర్చున్న సీటు ప్రక్కనే కూర్చున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి : డీఈవో



డీఈవోకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, జూన్ 25:జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని అదే విధంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల దోపిడిని అరికట్టాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది లేక విద్యార్థుల సంఖ్య పెరగడం లేదన్నారు. జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు అనుమతులు లేకుండానే, ఎలాంటి సౌకర్యాలు లేకుండానే, అర్హత కలిగిన టీచర్లు లేకుండానే విద్యాబోధన చేస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశూర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలు కళాశాలల యాజమాన్యాన్ని వేధిస్తే చర్యలు : సీపీ

ఖిల్లా, జూన్ 25: విద్యార్థి సంఘాల ప్రతినిధులు జిల్లాలోని ప్రైవేటు స్కూల్స్, కళాశాలల యజమానులను వేధిస్తూ గొడవలకు దిగి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్ ప్రకటనలో తెలిపారు. విద్యార్థి సంఘాల ప్రతినిధులు కళాశాలల క్యాంపస్‌లోకి ప్రవేశించరాదని విద్యకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు కలిగించరాదని పాఠశాలల్లో, కళాశాలల్లో సమస్యలు ఉంటే సంబంధిత విద్యాశాఖ అధికారులు, జిల్లా పాలనా అధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్య పరిష్కారానికి సామరస్యంగా కృషి చేయాలి తప్ప మీరంతట మీరు స్కూళ్ల, కాలేజీలకు వెళ్లి దాడులు నిర్వహించినట్లయితే, బంద్ చేయించినట్లయితే యజమానులను భయభ్రాంతులకు గురి చేసినట్లయితే శాఖపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ హెచ్చరించారు.

ప్రమాదకంగా మారిన విద్యుత్ వైర్లు



మోర్తాడ్‌లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

మోర్తాడ్, జూన్25: మండల కేంద్రంలోని పెద్దమ్మగుడి వద్ద వే లాడుతున్న విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. రైతులు ధాన్యాన్ని లారీలపై తీసుకువెళ్ళడానికి ఇబ్బందులుపడుతున్నారు. ఒడ్యాట్ రోడ్డులో పక్కన గల పెద్దమ్మగుడి వద్ద వైర్లు వేలాడుతుండడంతో రైతులు ట్రాక్టర్‌లు, లారీలపై తమ ధాన్యాన్ని తరలిం చడానికి ఇబ్బందులు పడుతున్నారు. వడ్ల సంచులను భారీ వాహనాలు తీసుకువెళ్లాలంటేట్రాన్స్‌ఫార్మర్ నుంచివి ద్యుత్ సరఫరా నిలిపివేసి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు.ఎన్నోసార్లు లారీలు వెళ్ళడంతో విద్యుత్ వైర్లు తగిలి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని రైతులు తెలిపారు. విద్యుత్ అధి కారులకు ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకు పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపించారు. రోడ్డుకు ఇరువైపుల రైతుల కల్లాలు ఉండ డంతో పండించిన ధాన్యం ఆరబెట్టుకుంటామని వాటిని తరలించేం దుకు లారీలపై తీసుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామ న్నారు. విద్యుత్ అధికారులకు వివరించిన పట్టించుకోవడంలేదని రైతులు అంటున్నారు.ఇప్పటికైనా ప్రమాదాలు జరగక ముందే అధి కారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా రోహిణి ప్రియదర్శిని బాధ్యతల స్వీకరణ



పోలీసులకు గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్

డిచ్‌పల్లి,జూన్ 25: తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఏడో పోలీస్ బెటాలియన్ కమాండెంట్ గా రోహిణి ప్రియదర్శిణి ఐపీఎస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బదిలీ అయిన కమాండెంట్ రాంప్రకాశ్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరిం చారు. బెటాలియన్ అభివృద్ధి సంక్షేమం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని బాధ్యతలు చేపట్టిన ప్రియదర్శిని తెలిపారు. బెటాలి యన్ ఏర్పాడిన నుంచి కమాండెంట్ గా మహిళ ఐపీఎస్ గా బాధ్యతలు స్వీకరించడం ఇదే ప్రప్రథమం. ఈ సందర్భంగా కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు శరత్, సత్యానా రాయణ, ఆర్ఐలు,ఆర్ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు. కమాండెంట్ గా ఇక్కడ పనిచేసిన రాంప్రకాశ్ 11 నెలలే ఇక్కడ పనిచేయడం గమనార్హం.

కల్తీ కల్లు విక్రయదారుడిపై చర్యలు తీసుకోవాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, సీపీలకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

డిచ్‌పల్లి,జూన్ 25: మండలంలని మిట్టపల్లిలో కల్తీ కల్లు విక్రయిస్తూ గ్రామ ప్రజల అనారోగ్యానికి కారకుడవుతున్న మేడిదస్వామి గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంగళవారం ఎక్సైజ్‌శాఖ డిప్యూటీకమి షనర్, సీపీ,రూరల్ ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు పత్రాలను గ్రామ స్థులు విలేకర్లకు అంద జేశారు. గ్రామంలో కల్తీకల్లును విక్రయిస్తున్న విషయం పై స్వా మి గౌడ్ అతని సోద రుడు శ్రీనివాస్‌గౌడ్ లను వీడీసీ సభ్యులు ప్రశ్నించగా వారిద్దరు వీడీసీపైనే పోలీసులు ఫిర్యాదు చేస్తున్నారని, తప్పులు కప్పి పుచ్చుకునేందుకు దౌర్జన్యాలకు వెనకా డటం లేదని వారిద్దరి పై చర్యలు తీసు కోవాలని కోరారు. తాను ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో రిపోర్టర్ నని బ్లాక్ మెయిల్ చేస్తు గంజాయి అక్రమ రవాణ, కలప అక్రమ రవాణా చేస్తు గ్రామంలో సమస్యలు సృష్టిస్తున్నారని వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, జూన్ 25: అధిక రేట్లకు పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీజీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు కమర్షియల్‌టాక్స్ మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్ మాట్లాడు తూ నగరంలో కొన్ని పాఠశాలలు పుస్తకాలు అమ్మేందుకు కోర్టు ఆర్డర్ ఉందని చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఎంఆర్‌పికి మించి వసూలు చేస్తున్నారని కావున వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అనిరుద్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305


బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72700	రూ.67,000	రూ.920

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మహారాజ (11.05, 4.30, 7.35, 10.40)
: మరణం (2.10)
స్క్రీన్-2 : ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (11.30, 5.05)
: మనమే (1.45)
: జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ (హిందీ) (7.25)
: ముంజియా (హిందీ) (10.35)
స్క్రీన్-3 : సందేహం (11.20)
: హనీమూన్ ఎక్స్‌ప్రెస్ (2.00)
: హరోం హర (4.40)
: ఓ మంచి గోస్ట్ (7.55)
: చందూ ఛాంపియన్ (హిందీ) (10.40)
స్క్రీన్-4 : నిందా (2.20, 7.50)
: ప్రభుత్వ జూనియర్ కళాశాల (5.00)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మహారాజ (1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 : ఓ మంచి గోస్ట్ (11.10, 4.35)
: ప్రభుత్వ జూనియర్ కళాశాల (1.40)
: నింద (7.30, 10.25)
స్క్రీన్-3 : మనమే (1.40, 4.45, 10.35)
: సందేహం (7.45)

దేవి : మహారాజ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: చందు ఛాంపియన్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : నింద (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్